



# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

ఆదివారం | 16-06-2024 | సంపుటి: 2 సంచిక: 46 పేజీలు: 4 వెల : రూ.7



చదవండి.. చదివించండి..
జాతీయ వార్త
తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి వెళతాం - ఎడిటర్
epaper:jatheeya vaartha.com www.jatheeya vaartha.com


# బాలికపై.. లైంగిక వేధింపులు



**✳ ప్రియుడితో కలిసి తల్లి దుశ్చర్య ✳ పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితురాలు ✳ ఇద్దరిపై పోక్సో కేసు నమోదు ✳ సభ్య సమాజం తలదించుకునేలా ఘటన**



**శ్రీకాకుళం క్రైం, జూన్ 15 (వార్త):** సభ్య సమాజం తలదించుకునేలా రోజురోజుకూ ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఆడది అయితే చాలు అన్నట్టుగా కొందరు పైశాచికంగా వ్యవహరిస్తున్నారు. కామంతో కళ్లుమూసుకుని చిన్నారులపై సైతం లైంగిక దాడులకు పాల్పడుతున్నారు. ఇటువంటి వాటిపై ఉక్కుపాదం మోపి.. తాను అబల కాదు సబల అని నిరూపించుకోవాల్సిన పరిస్థితులు తలెత్తాల్సిన పరిస్థితి రావాల్సివుంది. కన్నకూతురుపై.. ప్రియుడు లైంగిక వేధింపులకు గురిచేస్తున్నా పట్టించుకోలేదు సరికదా.. ఆ తల్లి ప్రోత్సహించడం దారుణం. ఇటువంటి కసాయి తల్లులను సభ్య సమాజం నుంచి వెలివేస్తే తప్ప మిగతా వారిలో మార్పు రాదు. శ్రీకాకుళం జిల్లాలోని ఓ గ్రామంలో ఓ బాలిక తన తల్లితో కలిసి నివాసం ఉంటోంది. ఆ బాలిక తల్లిదండ్రుల మధ్య గొడవలు కారణంగా విడిగా ఉంటున్నారు. బాలిక తల్లివద్దే ఉంటోంది. బాలిక తల్లి గుజరాతీపేటకు చెందిన ఓ వ్యక్తితో సన్నిహితంగా ఉంటోంది. ఈ విషయమై భార్యభర్తల మధ్య గొడవ కూడా జరిగి.. వేరుగా ఉంటోంది. ఆ వ్యక్తి తరచూ వీరి ఇంటికి వస్తున్నాడు. అంతేగాకుండా ఆ బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించడమే గాకుండా లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడు. ఈ విషయమై ఆ బాలిక తల్లికి చెప్పినా పట్టించుకోలేదు.. సరికదా ఆమె ప్రోత్సహించేది. చివరకు ఆమె ఈవిషయమై తండ్రి దృష్టికి తీసుకువెళ్లింది. తండ్రి సహకారంతో ఎచ్చెర్ల పోలీసులకు తల్లితో పాటు మరో వ్యక్తిపై ఫిర్యాదు చేసింది. ఓ బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారిద్దరిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్టు ఎచ్చెర్ల ఎస్ఐ ఎస్.చిరంజీవి తెలిపారు.

## గ్రానైట్ పరిశ్రమను ఆదుకోండి

**✳ మంత్రి అచ్చెన్నను కోరిన ఉత్తరాంధ్ర గ్రానైట్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధి బృందం**



**టెక్కలి, జూన్ 15 (వార్త):** రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధకశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును శని వారం విజయవాడలో శ్రీకాకుళం జిల్లాలోని పలు గ్రానైట్ క్వారీ యాజమాన్య ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువా కప్పి, పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. గడచిన ఐదేళ్లుగా గ్రానైట్ క్వారీ యాజమాన్యాలు ఎదుర్కొన్న సమస్యలు, పలు రకాల పన్నుల ప్రభావంతో పడిన ఇబ్బందులు ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. గ్రానైట్ పరిశ్రమకు ఉన్న రాయితీలు గత ప్రభుత్వ హయాంలో ఎత్తివేయడంతో జరిగిన నష్టాలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. జిల్లాలో ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాదిమందికి ఉపాధి కల్పించే గ్రానైట్ పరిశ్రమను తిరిగి పునరు ద్ధరించేలా చర్యలు తీసుకోవాలని అచ్చెన్నాయుడును వారు కోరారు. అచ్చెన్నాయుడును కలిసిన వారిలో ఉత్తరాంధ్ర గ్రానైట్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కోత మురళీధర్, మధుకాన్ శ్రీనివాస్, హరి, నగేష్, ఎల్.శ్రీనివాస్, రామారావు, లక్ష్మీనారాయణ, రాజేష్, మోడల్ రవి తదితరులున్నారు.

## పాము కాటుతో వృద్ధుడి మృతి

**కవిటి, జూన్ 15 (వార్త):** గొర్లెపాడు గ్రామానికి చెందిన వృద్ధుడు తీగల త్రినాథ్(79) పాముకాటుకు గురై మృతి చెందాడు. త్రినాథ్ శుక్రవారం రాత్రి 9గంటల సమయంలో ఇంటి గుమ్మం వద్ద కూర్చొని ఉండగా.. అదే సమయంలో పాము కాటు వేసింది. వెంటనే సోంపేట ఆసుపత్రికి తరలిం చారు. వైద్యులు చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో బరంపురం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు.

## వడదెబ్బతో వ్యక్తి..

**గార, జూన్ 15 (వార్త):** కొర్ని గ్రామానికి చెందిన భావన రమణమూర్తి(60) ఉత్తరప్రదేశ్ రాష్ట్రం అలహాబాద్‌లో వడదెబ్బకు గురై మృతి చెందాడు. రమణమూర్తి ఇటీవల తన మిత్రులతో కలిసి తీర్థయాత్రలకు వెళ్లారు. ఈ నేపథ్యంలో శనివారం అస్వస్థతకు గురవ్వడంతో తోటి స్నేహితులు రమణమూర్తిను అలహాబాద్‌లోని ఓ హాస్పిటల్‌కు తీసుకువెళ్లారు. వడదెబ్బకు గురై అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. రమణమూర్తితో వెళ్లినవారు ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కాగా రమణమూర్తి కొన్నేళ్లుగా ఓ దినపత్రికలో గార మండల విలేకరిగా పనిచేస్తున్నారు. ఇతడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

# బడి బస్సులు.. భద్రమేనా?



**✳ ఫిట్నెస్ లేకుండా బస్సుల్లో విద్యార్థుల తరలింపు**
**✳ ప్రతి ఏటా ప్రమాదాల బారిన స్కూల్ బస్సులు**
**✳ విద్యార్థులతో ప్రాణాలతో చెలగాటం**
**✳ నిబంధనలు పాటించని పలు విద్యాసంస్థల యాజమాన్యాలు ఫీజులపై ఉన్న శ్రద్ధ విద్యార్థులపై ఉండదన్న విమర్శలు**
**✳ రవాణా శాఖాధికారుల తనిఖీలు మొక్కుబడే**
**✳ ప్రమాదాలు జరిగినపుడు అధికారుల అత్యుత్సాహం**

**శ్రీకాకుళం, జూన్15 (వార్త):** పాఠశాలలు పున: ప్రారంభమయ్యాయి. పలు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు తమకు చెందిన బస్సుల్లో విద్యార్థులను ఇతర ప్రాంతాల నుంచి తరలిస్తున్నారు. దీనికి గాను విద్యార్థుల నుంచి ఫీజులు కూడా పెద్ద ఎత్తున చార్జ్ చేస్తున్నారు. అయితే కొన్ని విద్యాసంస్థలు ఫిట్‌నెస్‌లేని బస్సుల్లో విద్యార్థులను తరలిస్తూ వారి ప్రాణాలను బలిగొంటున్నారు. ప్రతి ఏటా బస్సులకు ఏటా సామర్థ్య ధ్రువీకరణ పత్రం (ఎఫ్‌సీ) విధిగా తీసుకోవాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించి 32 నిబంధనలు ఉన్నాయి. ఇవి కచ్చితంగా పాటిస్తేనే ధ్రువీకరణ పత్రాలను రవాణా శాఖాధికారులు ధ్రువపత్రాలు అందజేస్తారు. అయితే పలు విద్యాసంస్థల యాజమాన్యాలు ఈ నిబంధనలు పట్టించుకోరు. కొందరు రవాణాశాఖా ధికారులకు చేతులు తడుపుతూ ఫిట్‌నెస్ లేని బస్సులు నడుపుతూ విద్యార్థుల ప్రాణాలను బలితీసుకుంటున్నారు. శ్రీకాకుళం జిల్లాలో ప్రతి ఏడాది రెండు మూడు బస్సు ప్రమాదాలు జరుగుతున్న విషయం తెలిసిందే. మితిమీరి విద్యార్థులను బస్సుల్లో తరలించడం, నైపుణ్యం గల డ్రైవర్లను నియమించుకోకపోవడమే కారణం. రవాణా శాఖాధికారులు సైతం స్కూల్ బస్సులు ప్రమాదాలు జరిగినపుడు అతిగా స్పందించడం, ఆ తర్వాత మిన్నకుండడం షరామామూలే. శ్రీకాకుళం జిల్లాలో సుమారు 500లకు పైగానే బడి బస్సులు తిరుగుతున్నాయి. ఏపీ మోటారు వాహనాల చట్టం-185 ప్రకారం బస్సుకు పొందుపరిచిన నిబంధనలు పాటించాల్సిందే. విద్యాసంస్థ పేరు, మొబైల్ నంబరు, పూర్తి చిరునామా, బస్సుకు ఎడమ వైపు, ముందు భాగంలో స్పష్టంగా కనిపించేలా ఉండాలి. 50 సంవత్సరాల లోపు ఉండి, ఐదేళ్ల పాటు అనుభవం కలిగిన చోదకులను నియమించాలి. ఎప్పటికప్పుడు కంటి పరీక్షలు చేయించుకోవాలి. చోదకుడు, సహాయకుడు తప్పనిసరిగా ఖాకీ దుస్తులు ధరించాలి. బస్సులో కచ్చితంగా ప్రథమ చికిత్స పెట్టె ఉండాలి. ఫిర్యాదుల పుస్తకంతో పాటు అగ్నిమాపక నియంత్రణ వ్యవస్థ, పిల్లలు సక్రమంగా కూర్చునేందుకు సౌకర్యవంతమైన సీట్లు, వాహన సామర్థ్య ధ్రువీకరణ పత్రం తప్పని సరిగా ఉండాలి. ఈ నిబంధనలు అమలయ్యేలా రవాణాశాఖాధి కారులు చూస్తే ప్రమాదాలు నివారించవచ్చు. అధికారులు ఏం చేస్తారో చూడాలిమరి.

## ఎండీయూ ఆపరేటర్ల సమస్యలను పరిష్కరిస్తా


**శ్రీకాకుళం టౌన్, జూన్15 (వార్త):**ఎండీయూ ఆపరేటర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శనివారం ఎమ్మెల్యే శంకర్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో ఎండీయూ ఆపరేటర్లు అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రౌతు సూర్య నారాయణ ఆధ్వర్యంలో కలిశారు. పుష్పగుచ్ఛమందజేసి సత్కరించారు. అనంతరం తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి, అలాగే పౌరసరఫరాల శాఖ మంత్రి దృష్టిలో ఉంచుతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం నియోజకవర్గ ఎండీయూ ఆపరేటర్లు బొట్ట రామారావు, వేణుగోపాల్, సురేష్, నరేష్, అప్పారావు, బాలకృష్ణ, శ్రీను, రాజు, మాధవ్, కిరణ్, శివ ప్రసాద్, దివాకర్, ఈశ్వర్, శంకర్, రాజా, బుజ్జి, కిషోర్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.



# గ్రంథాలయ అభివృద్ధికి దాతలు సహకరించాలి

*** మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తా * నిరుద్యోగ అభ్యర్థులకు అండగా నిలుస్తాం**

*** శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్**



**శ్రీకాకుళం టౌన్, జూన్15 (వార్త):** శ్రీకాకుళం జిల్లా కేంద్ర గ్రంథాలయ అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తానని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా గ్రంథాలయంలో కనీస మౌలిక సదుపాయాలకు నోచుకోలేదని తెలిపారు. మున్సిపాలిటీ నుంచి రావాల్సిన గ్రంథాలయ పన్నులు కూడా సకాలంలో అందక గ్రంథాలయ సిబ్బందికి జీతాలు అందడం లేదని చెప్పారు. నిరుద్యోగ అభ్యర్థులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. దీనికి ఆయన స్పందిస్తూ గ్రంథాలయంలో ఫ్యాన్లు, మరుగుదొడ్లు, కంప్యూటర్లను సైతం రెండు రోజుల్లో బాగు చేయించి అందుబాటులోకి తెస్తానని హామీ ఇచ్చారు. అలాగే జిల్లాకు చెందిన దాతలు ముందుకు వచ్చి గ్రంథాలయంలో మౌలిక సదుపాయాల కల్పనకు సహకరించాలని కోరారు. గ్రంథాలయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎమ్మెల్యే శంకర్ పిలుపునకు స్పందిస్తూ మాజీ కౌన్సిలర్ కెల్లా కొండలరావు పదివేలు, శ్రీ శయన సంఘం జిల్లా అధ్యక్షుడు మండల మన్మథరావు పదివేలు, రూపాయలు, వేట పద్మ 5000 విరాళంగా ప్రకటించారు. గ్రంథాలయంలో మేడపై రూము తమకు కేటాయించాలని అభ్యర్థులు కోరగా వారికి అందజేయాలని గ్రంథాలయ అధికారికి సూచించారు. అలాగే కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు సహకారంతో అభ్యర్థులకు అవసరమైన అన్ని పోటీ పరీక్షల పుస్తకాలను అందుబాటులో ఉంచుతామని హామీని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ శ్రీకాకుళం నగర అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, నాగేంద్ర యాదవ్, తోనంగి వెంకన్న, మైలపల్లి నరసింహమూర్తి, బోర బీన, బుర్రి మధు, దుంగ శ్రీధర్, కవ్వాడి సుశీల పాండ్రంకి శంకర్, సిరిపురపు హరి, రాయిపల్లి అర్జున్, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్ రాజా, గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

## సంతబొమ్మాళి ప్రెస్ క్లబ్ గౌరీశంకర్ రెడ్డి



**సంతబొమ్మాళి, జూన్ 15 (వార్త):** సంతబొమ్మాళి ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం సీనియర్ జర్నలిస్ట్ కర్రి శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో సంతబొమ్మాళిలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రింట్, మీడియా ప్రతినిధులు హాజరై ఏకగ్రీవంగా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దూపాన గౌరీ శంకర్‌రెడ్డి, కార్యదర్శిగా పాండవ సంతోష్, ఉపాధ్యక్షుడిగా సూరాడ జోగారావు, కోశాధికారిగా పోకల నగేష్ శర్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ పాత్రికే యుల హక్కులు సంక్షేమం కోసం పాటుపడతమన్నారు. నూతన కార్యవర్గం ఎంపీ డీవో ఉమా సుందరిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు సీరపు రవికుమార్, పిరియా చంద్రశేఖర్, మణిపాత్రుని శ్రీనివాస్‌చ, బైపల్లి భీమారావు, లోపింటి ప్రసాద్ రెడ్డి, సదా శివ, జనెల భానుప్రకాష్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ



**సంతబొమ్మాళి, జూన్ 15 (వార్త):** మరువాడ పంచాయతీలోని ఎంపీయుపి పాఠశాలలో విద్యార్థులకు శనివారం సర్పంచ్ సూరాడ ధనలక్ష్మి, విద్యా కమిటీ చైర్మన్ సూరాడ దాసురాజు, హెచ్ఎం రాజీవ్ పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# సేవ్ పలాస.. మా నినాదం

### పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష



**పలాస, జూన్ 15 (వార్త):** సేవ్ పలాస నినాదానికి కట్టుబడి ఉన్నానని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. వైసీపీ ప్రభుత్వం మాదిరిగా మా పాలనలో ఎటువంటి కక్షసాధింపు చర్యలు ఉండవని తెలిపారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పలాస టీడీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మా పాలనలో గతంలో వైసీపీ చేసిన విధంగా అక్రమ కేసులు, ఇళ్ల కూల్చివతలు ఉండవచ్చన్నారు. తాము వైసీపీ కార్యకర్తల జోలికి వెళ్లబోమన్నారు. కార్యకర్తల విలువ ఏమిటో తమకు తెలుసన్నారు. అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తామని తెలిపారు. ఐదేళ్లలో వైసీపీ నేతల అక్రమాలపై దర్యాప్తు చేయిస్తామన్నారు. తనకు వచ్చిన మెజారిటీ అప్పలరాజుపై ఉన్న వ్యతిరేకతను ఆయన గుర్తించాలన్నారు. ఇప్పటికైనా అప్పలరాజులో మార్పు వచ్చి మంచి చేసే మా పాలనలో పాల్పంచుకోవాలని కోరారు. సంక్షేమ పథకాలు కూడా నిష్పక్షపాతంగా అందిస్తామన్నారు. గత ఐదేళ్లలో అన్ని వర్గాలను వైసీపీ నేతలు ఇబ్బందులు పెట్టారన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు వజ్జ బాబూరావు, బడ్డ నాగరాజు, పి.విఠల్, గురిటి సూర్యనారాయణ, మల్లా శ్రీనివాసరావు, గాలి క్రిష్ణారావు, యవ్వారి మోహనరావు, అంబటి క్రిష్ణమూర్తి పాల్గొన్నారు.



### జీడి పిక్కలకు మద్దతు ధర ప్రకటించాలి

ఉద్దాన ప్రాంతంలో సాగు చేస్తున్న జీడి పిక్కల 80 కేజీల బస్తా రూ.16 వేలుకు రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. పలాస టీడీపీ కార్యాలయంలో శనివారం జీడి రైతుల సంఘం నాయకులు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జీడి రైతుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలాస కేంద్రంగా రాష్ట్రంలో జీడి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. స్థానిక పిక్కలను కొనుగోలు చేసిన తర్వాతే విదేశీ పిక్కల దిగుమతులకు అనుమతి ఇవ్వాలని కోరారు. జీడి తోటలలో అంతర కృషి పరికరాలు ఉచితంగా రైతులకు అందించాలన్నారు. జీడి పరిశోధన కేంద్రాలు ప్రాంతాల వారీగా ఏర్పాటు చేసి, అభివృద్ధి చేసిన నాణ్యమైన మొక్కలు రైతులకు అందించాలని కోరారు. జీడి పంట విస్తరణకు, జీడి తోటలు పునరుద్ధరణకు ప్రభుత్వం రాయితీలు, ప్రోత్సాహకాలు ప్రకటించాలని కోరారు. ఉపాధి హామి పథకం ద్వారా ఎకరం జీడి తోట అభివృద్ధికి మూడు సంవత్సరాలకు 94 వేల రూపాయలు రైతులకు క్షేత్ర స్థాయిలో అందించాలని కోరారు. జీడి పంటకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం బ్యాంకుల ద్వారా పంట రుణాలు అందించాలని, రైతువారీ సాగు విస్తీర్ణం నమోదు చేసి జీడి పంటకు వాతావరణ, బీమా అమలు చేయాలన్నారు. జీడి పంట ప్రాంతంలో జీడి పిక్కలు, జీడి పండ్ల ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాట్లు చేయాలని, జీడి రైతులకు జీడి పిక్కలు ఆరబెట్టుటకు టార్పాలిన్లు ఉచితంగా పంపిణీ చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో కుత్తుం వినోద్, కొండప్ప సూరేఖ, కోనేరు సురేష్, అంబటి రామకృష్ణ, యంపల్ల జోగారావు, మద్దిల రామారావు,మడ్డు రాఘవరావు, కోనేరు ఆదినారాయణ, పుచ్చ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

### భూ కబ్జాలపై విచారణ జరిపించాలి

పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని సూదికొండ, నెమలికొండ ప్రాంతాలలో గత ఐదేళ్లలో అనేక భూకబ్జాలు జరిగాయని వాటిపై అధికారులతో మాట్లాడి విచారణ జరిపించాలని సూది కొండకు చెందిన యువకులు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషకు వినతిపత్రం అందించారు. దీనికి ఆమె సానుకూలంగా స్పందిస్తూ భూ కబ్జాలపై ఉక్కు పాదం మోపుతామని ఇప్పటికే ఆర్డీవోకు ఫిర్యాదు చేశామన్నారు.

## రాగోలు ఆల్బం సాంగ్ చిత్రీకరణ



**ఆమదావలస, జూన్ 15 (వార్త):** ప్రముఖ మ్యూజిక్ సంస్థ బీట్ ల్యాబ్ మ్యూజిక్ ఇన్ఫినిటీ ఆధ్వర్యంలో శనివారం రాగోలు జంక్షన్ వద్ద ఆల్బమ్ సాంగ్‌ను చిత్రీకరించారు. ఈ పాట చిత్రీకరణను ఏపీ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీరావు క్లాప్ కొట్టారు. న్యాయవాది గురుగుబెల్లి నరసింహమూర్తి, అక్షర చిత్రం నిర్మాత తంగుడు సుధీర్ కెమెరా స్విచ్ఛాన్ చేశారు. ఆల్బమ్ సాంగ్స్‌తోపాటు జానపద, సాంస్కృతిక పాటలను చిత్రీకరిస్తున్నామని సంస్థ అధినేతలు బగాది కిషోర్, మల్లాది దివాకర్, కన్నేటి శివరామిరెడ్డి, తాలాసు రవికాంత్ తెలిపారు. మా సంస్థ ద్వారా నిర్మించిన 'ఆకాశం తాకిందా' అనే పాటను ఆరు భాషల్లో విడుదల చేశామని, ఎనిమిది లక్షలకు పైగా వ్యూస్ సాధించాయన్నారు. ప్రస్తుతం నిర్మిస్తున్న పాటను శ్రీకాకుళం జిల్లాలోని పలుచోట్ల చిత్రీకరించి విడుదల చేస్తామన్నారు. ఈ పాటలో హీరోగా సూర్య భరత్ చంద్ర, హీరోయిన్‌గా సహస్రారెడ్డి నటిస్తున్నారు. డైరెక్టర్‌గా సందీప్ బద్దుల, మ్యూజిక్ డైరెక్టర్‌గా ఆది పొన్నాన్‌లు వ్యవహరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పేడాడ శ్రీధర్, తాండ్ర సునిల్, తాండ్ర సతీష్ బాబు, లఖినేని సునిల్, లక్కోజి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు

## మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

### మున్సివల్ చైర్మన్ బల్ల గిరిబాబు

**పలాస, జూన్ 15 (వార్త):** మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా పనిచేస్తే ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని వలాస మున్సివల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. శనివారం మెప్మా కార్యాలయంలో నిబ్బందితో ఆయన సమీక్షా సమా వేశం నిర్వహించారు. 2023-24 సంవత్సరాలకు సంబంధించి ఆర్థిక లావా దేవీలు, మెప్మా వరిధిలో సంతృప్తికరంగా చేపట్టారన్నారు. అదే విధంగా 2024-25లో ఏడాదికి సంబంధించి జిల్లా ఐ.బి, ఎల్.హెచ్, బి.ఎస్.లపై చర్చించి వాటిపై సంఘాలకు శిక్షణ అందించి గత ఏడాదిగా మారిదిగానే మంచి ఫలితాలు తీసుకు రావాలని సూచించారు. మహిళాసంఘాలు తీసుకున్న పొదువు రుణాలు ఎప్పటి కప్పుడు సకాలంలో చెల్లించే విధంగా చర్యలు చేవట్టాలన్నారు. సమావేశంలో కమిషనర్ నాగేంద్రకుమార్, మోహన్, ఆర్‌పిలు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.



## చంద్రబాబు పాలనతోనే అభివృద్ధి, సంక్షేమం

**శ్రీకాకుళం టౌన్, జూన్ 15 (వార్త):** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాలనలోనే ప్రతి గ్రామం అభివృద్ధి బాటలో నడుస్తూ ప్రజా సంక్షేమం సాధ్యపడుతుందని 50వ డివిజన్ టీడీపీ ఇన్చార్జి, మాజీ కౌన్సిలర్ సీపాన మల్లేశ్వరరావు అన్నారు. 10 లక్షల రూపాయల మున్సిపల్ జనరల్ ఫండ్‌తో సీపన్నాయుడుపేటలో కాలువ పూడికతీత పనులను శనివారం చేపట్టారు. శ్రీకాకుళం నగర కార్పొరేషన్ కమిషనర్‌గా తమీమ్ అన్సారియా ఈ కాలువ పూడికతీతను పరిశీలించారు. ఈ సందర్భంగా మల్లేశ్వరరావు మాట్లాడుతూ గ్రామానికి సంబంధించి మురుగునీటి సమస్య అధికంగా ఉందని, కాలువల పూడికతీత సకాలంలో తీయించే విధంగా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులతో పాటు స్థానిక గ్రామ పెద్దలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక





## ఎమ్మెల్యే శంకర్‌ను కలిసిన సక్షం ప్రతినిధులు

**శ్రీకాకుళం టౌన్, జూన్15 (వార్త):** శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌ను దివ్యాంగ, సక్షం సంఘం నాయకులు ఎ.రమా, సీహెచ్ గణపతిరావులు శనివారం కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేను వారు కోరారు.

## బక్రీద్‌ను ప్రశాంత వాతావరణంలో చేసుకోండి

**శ్రీకాకుళం క్రైం, జూన్ 15 (వార్త):** ముస్లిం సోదరులు బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో కుటుంబ సభ్యులతో సంతోషంగా చేసుకోవాలని ఎస్పీ జీఆర్ రాధిక శనివారం ఒక ప్రకటనలో సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రధాన మసీదులు, ఈద్గాల వద్ద కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గోవులను ఒక చోట నుంచి మరో చోటుకు తరలించే క్రమంలో తగిన ధ్రువీకరణ పత్రాలను కలిగివుండాలని లేకుంటే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గోవులను వధించడం పూర్తిగా నిషేధమన్నారు. చట్టాన్ని ఎవరైనా అతిక్రమిస్తే, అట్టివారిపై కఠిన శిక్ష పడేలాగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా గోవుల రవాణాపై నిఘా ఏర్పాటు చేశామన్నారు. మతసామరస్యానికి భంగం కలిగించే విధంగా ఎవరైనా రెచ్చగొట్టే ప్రసంగాలు చేసినా, సోషల్ మీడియాలో అసభ్య పోస్టులు పెట్టినా కఠినచర్యలు తప్పవన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలో ఏదైనా అవాంఛనీయ సంఘటనలు ఉత్పన్నమయ్యే పరిస్థితులు ఉంటే శ్రీకాకుళం జిల్లా పోలీసు వాట్సాప్ నెంబర్ 6309990933 కు సమాచారాన్ని అందించాలని ఎస్పీ జీఆర్ రాధిక కోరారు.

## గెస్ట్ టీచర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**విజయనగరం, జూన్ 15 (వార్త):** జిల్లాలోని తాటిపూడిలో వున్న ఏ.పి.బాలికల గురుకుల పాఠశాలలో గెస్ట్ టీచర్(పి.జి.టి) గా నియామకానికి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ జె.ఎన్.సంధ్యాభార్గవి తెలిపారు. ఇంగ్లీషు, గణితం, భౌతిక శాస్త్రం సబ్జెక్టుల్లో పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. పై సబ్జెక్టుల్లో పి.జి., బి.ఎడ్. విద్యార్హత కలిగి బోధనలో అనుభవం ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల19వ తేదీలోగా తాటిపూడిలోని గురుకుల పాఠశాలలో స్వయంగా దరఖాస్తులు అందజేయాలన్నారు. ఇతర వివరాలకు 8712625024 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

## జంతు సంక్షేమచట్టాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

**విజయనగరం, జూన్ 15 (వార్త):** బక్రీద్ పండుగ రోజు జిల్లాలో అక్రమంగా పశు వధ, అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలను తీసుకుంటామని జిల్లా పశు సంవర్ధకశాఖాధికారి డాక్టర్ ఎ.విశ్వేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ప్రతిఒక్కరూ తప్పనిసరిగా జంతు సంక్షేమ చట్టాలను పాటించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ ప్రిజర్వేషన్ అండ్ ప్రొహిబిషన్ ఆఫ్ స్లాటరీ యాక్ట్-1977 అండ్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫ్ యానిమల్ రూల్స్ 1978, 2001 ప్రకారం, జంతు సంక్షేమ చట్టాలను ఉల్లంఘించినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

## స్పందన పేరు మార్పు

**విజయనగరం, జూన్15(వార్త):** ప్రజా సమస్యలను తెలుసుకోవడానికి ప్రతీ సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమం పేరు మారింది. ఇకనుంచి ఈ కార్యక్రమాన్ని పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసిల్ సిస్టమ్‌గా మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు విజయనగరం జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు.

## నేడు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ రాక

**విజయనగరం, జూన్ 15 (వార్త):** రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ సాధికారత, సంబంధాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదివారం ఉదయం విజయనగరం జిల్లాకు చేరుకుంటారు. మంత్రి పదవి చేపట్టి, జిల్లాకు తొలిసారిగా వస్తున్న శ్రీనివాస్‌కు ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మంత్రి శ్రీనివాస్ ఆదివారం ఉదయం విశాఖపట్నంలో 9 గంటలకు బయలుదేరి, 10 గంటలకు జిల్లాకు చేరుకుంటారు. ముందుగా పైడితల్లి అమ్మవారిని దర్శనం చేసుకుంటారు. అశోక్ బంగ్లాలోని టీడీపీ కార్యాలయంలో ఉదయం 10.30కి పాత్రికేయుల సమావేశంలో పాల్గొంటారు. అనంతరం 12 గంటలకు తమ స్వస్థలం గంట్యాడ వెళ్లి, స్థానిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. అక్కడినుంచి 12.45 గంటలకు గజపతినగరం వెళ్లి పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటారు. అనంతరం విజయనగరంలోని తమ స్వగృహానికి చేరుకుంటారు. మధ్యాహ్నం 3.30 గంటలు నుంచి జిల్లాపరిషత్ అతిథి గృహంలో సందర్శకులను కలుస్తారు. రాత్రి విజయనగరంలోని బస చేస్తారు.

## నేడు కాంగ్రెస్ ఎమ్మెల్యేల ర్యాలీ

**రాయగడ, జూన్ 15 (వార్త):** ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 14 నియోజకవర్గాల్లో విజయం సాధించింది. ఈ సందర్భంగా ఆ పార్టీ రాయగడ పట్టణంలో ఒక ర్యాలీ నిర్వహించడానికి సన్నాహాలు చేసింది. ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక మజ్జి గౌరమ్మ మందిరం నుంచి హొటల్ తేజస్వి గ్రౌండ్ వరకు ఈ ర్యాలీ జరుగుతుంది. ఒడిశా రాష్ట్రంలో కొరాపుట్ నియోజకవర్గం నుంచి ఒకే కాంగ్రెస్ అభ్యర్థి సప్తగిరి ఉలక ఎంపీగా గెలిచారు. సప్తగిరి ఆధ్వర్యంలో ఈ ర్యాలీ జరుగుతుంది. అనంతరం హొటల్ తేజస్వి ఎదురుగా ఉన్న మైదానంలో ఒక పెద్ద బహిరంగ సభ జరుగు తుంది. 14నియోజకవర్గాల నుంచి ఎమ్మెల్యేలు పాల్గొంటారని సమాచారం.

## 5టీ ఫ్లకార్డులు తొలగింపు

**రాయగడ, జూన్ 15 (వార్త):** జిల్లాలోని ఉన్నత పాఠశాలల్లో 5టి ఫ్లకార్డులను తొలగించేందుకు జిల్లా విద్యాశాఖాధికారి చర్యలు చేపట్టారు. 11 బ్లాకుల్లోని 158 ఉన్నత పాఠశాలల్లో 5టి బోర్డులను తొలగించాలని జిల్లా విద్యాశాఖాధికారి బసంత్ కుమార్ నాయక్ సంబంధిత ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. దీంతోపాటు జిల్లాలోని అన్ని గ్రూపు ఎడ్యుకేషన్ అధికారుల కార్యాలయాల్లోని 5టి బోర్డులను కూడా తొలగించాలని ప్రభుత్వం ఆదేశించింది. గత ప్రభుత్వ హయాంలో జిల్లాలోని వివిధ ఉన్నత పాఠశాలలు 5టి పథకాలు కొనసాగాయి. ఒక్కో పాఠశాలకు రూ.50 లక్షల నుంచి రూ.1.5 కోట్ల వరకు ఖర్చు చేశారు. ఇప్పుడు రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత అన్ని పాఠశాలల్లో 5టి బోర్డులు తొలగించాలని ఆదేశించారు. ప్రస్తుతం పాఠశాలలకు సెలవులు కావడంతో అన్ని పాఠశాలల్లో అమలు చేయడం లేదు. పాఠశాలు తెరిచిన తర్వాత శాఖాపరమైన ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

# త్వరలోనే నామినేటెడ్ పోస్టుల భర్తీ

* కార్యకర్తల రుణం తీర్చుకుంటా
* వంద రోజుల్లో అన్నా క్యాంటీన్లు తెరుస్తాం
* ఏపీ సీఎం చంద్రబాబునాయుడు



**అమరావతి, జూన్ 15(వార్త):** పార్టీ కోసం కష్టపడిన వారి కోసం త్వరలోనే నామినేటెడ్ పోస్టులు భర్తీ చేస్తానని టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారి ఆయన మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా పార్టీ నేతలతో టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, బూత్ స్థాయి కార్యకర్తలు ఇందులో పాల్గొన్నారు. కింది స్థాయి నుంచి ఎవరు ఎక్కడ పార్టీ కోసం పని చేశారో వారికే పదవులు దక్కేలా అధ్యయనం ప్రారంభించామన్నారు. నేతలు, కార్యకర్తలు సాధికారత సాధిస్తే పార్టీ పునాదులు బలంగా ఉంటాయని పేర్కొన్నారు. అన్న క్యాంటీన్లు ఎక్కడెక్కడ మూతపడ్డాయో వాటిని వందరోజుల్లోనే తెరి పించే కార్యక్రమం ఉంటుందన్నారు. గత 20 ఏళ్లలో ఎన్నడూ గెల వని సీట్లలో కూడా ప్రజలు తెదేపాకి అధికారాన్ని కట్టబెట్టారంటే అది వారు పెట్టుకున్న నమ్మకమని చెప్పారు. కూటమికి 93 శాతం స్ట్రైక్ రేట్, 57 శాతానికిపైగా ఓట్లు వచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. కూటమిలోని మూడు పార్టీల పాత్ర ఎంతో కీలకంగా పనిచేసిందన్నారు. ఈ ఘన విజయానికి కారణమైన కార్యకర్తల రుణం తప్పకుండా తీర్చుకుంటానని చంద్రబాబు స్పష్టం చేశారు.



## ఎమ్మెల్యే బెందాళంకు శుభాకాంక్షలు

**ఇచ్ఛాపురం, జూన్15 (వార్త):** మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు నుంచి పెద్ద ఎత్తున ప్రజలు, అభిమానులు, కార్యకర్తలు, నాయకులు ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువ కప్పి సత్కరించారు. వార్డు యువజన తెలుగుదేశం నాయకుడు దుక్క జోగారావు రెడ్డి ఆధ్వర్యంలో పలువురు ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. రంగాల వీధి, కస్పా కొయ్య వీధి, బొబ్బిలి వీధి, జాలరి వీధి, తదితర ప్రాంతాల నుంచి తరలి వెళ్లారు.

## 'స్పందన' పేరు మారుస్తూ ఉత్తర్వులు

**అమరావతి, జూన్ 15 (వార్త):** ప్రతి సోమవారం స్పందన పేరిట కలెక్టరేట్‌లో చేపట్టే కార్యక్రమం పేరును మారుస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థగా కొనసాగించాలని ఆదేశించింది.

# 19 నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు

**అమరావతి, జూన్15 (వార్త):** ఆంధ్రప్రదేశ్‌లో కొత్త ప్రభుత్వానికి సంబంధించిన పనులు చురుగ్గా సాగుతున్నాశీఏయి. ఈ నెల12 వ తేదీన ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే. 13న సచివాలయంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు స్వీకరించారు. 14న మంత్రులకు శాఖలు కేటాయించారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీ సమావేశాల నిర్వహణకు కొత్తప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ నెల 18న కేబినెట్ తొలి సమావేశం జర పాలని నిర్ణయించింది. 19వ తేదీ నుంచే అసెంబ్లీ సమావేశాలు ఏపీ ప్రభుత్వం నిర్వహించనున్నది. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే అసెంబ్లీ సమావేశాల నాటికి ఏపీలో శాంతిభద్రతల పరిస్థితి, పోలీసు హింస, లాక్ అప్ డెత్, అధికార దుర్వినియోగం, పోలీసుల పక్షపాత వైఖరి తదితర అంశాలపై పూర్తి సమాచారాన్ని సిద్ధం చేసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఈ మేరకు ఆయా ఎస్పీలు, సీపీలకు ప్రభుత్వం లేఖలు రాసింది.




## 423వ రోజుకు
# శంకర్ అన్నా క్యాంటీన్

* నిరంతరాయంగా నిత్యాన్నదానం
* ప్రభుత్వం ప్రారంభించే వరకూ కొనసాగింపు



**శ్రీకాకుళం టౌన్, జూన్ 15 (వార్త):** నగరంలోని ఏడురోడ్ల కూడలి, పాత బస్టాండ్ ప్రాంతాల్లో గొండు శంకర్ ప్రారంభించిన అన్నా క్యాంటీన్ శనివారం నాటికీ 423వ రోజుకు చేరుకుంది. ఈ రెండు ప్రాంతాల్లో వాహనం ద్వారా వేలాది మందికి నిత్యాన్నదానం నిరంతరాయంగా సాగుతోంది. పేదలు, యాచకులు, ఆనాధలు. అన్నార్తులు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఆకలితో అలమటించకూడదనే లక్ష్యంతో ప్రారంభమైన అన్నా క్యాంటీన్ ప్రతిరోజూ లక్ష్యాన్ని నెరవేరుస్తోంది. తిరిగి ప్రభుత్వం అన్నా కాంటీన్లు ప్రారంభించేంతవరకు దీన్ని కొనసాగిస్తామని ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రకటించిన విషయం తెలిసిందే. అన్నా కాంటీన్ల పునరుద్దరణకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో అవి ప్రారంభం కాకుండా వాహనం ద్వారా అందిస్తున్న నిత్యాన్నదానం రద్దు చేస్తారనే ఆందోళన చెందనక్కర్లేదని శంకర్ భరోసానిచ్చారు. ఎన్ని రోజులైనా, ఎంత ఖర్చు అయినా ప్రభుత్వం అన్నా కాంటీన్లు ప్రారంభం అయ్యేంతవరకు శంకర్ అన్నా క్యాంటీన్ అన్నార్థుల ఆకలి తీరుస్తుందని శంకర్ పేర్కొన్నారు.

## సీఎంను కలిసిన కలమట

**శ్రీకాకుళం టౌన్, జూన్ 15 (వార్త):** సీఎంగా బాధ్యతలు స్వీకరించిన చంద్రబాబునాయుడిని శ్రీకాకుళం జిల్లా టీడీపీ అధ్యక్షుడు కలమట వెంకటరమణమూర్తి శనివారం కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

## 108 అంబులెన్స్ సేవలు తనిఖీ

**మందస, జూన్ 15(వార్త):** మందస మండలంలో సేవలు అందిస్తున్న 108 అంబులెన్స్ సేవలను డివిజనల్ ఆపరేషన్ అధికారి గండేపల్లి జగన్నాథరావు తనిఖీ చేశారు. వాహనం నిర్వహణ, పనితీరు, పరికరాలు, అత్యవసర మందుల నిర్వహణ, రికార్డులు, డ్యూటీ చార్ట్‌లను పరిశీలించారు. ఆయనతో పాటు సిబ్బంది ఎ.మోహనరావు, ఎం.రామచంద్రరావు కూడా ఉన్నారు.

# రైతులకు అందుబాటులో ఉండండి

* పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు
* రైతులకు వరి విత్తనాలు పంపిణీ



**పాతపట్నం, జూన్ 15 (వార్త):** ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ కావడంతో వ్యవసాయాధికారులు ఎల్లవేళలా రైతులకు అందుబాటులో ఉండాలని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. శనివారం పాతపట్నం నియోజకవర్గ కేంద్రంలో వ్యవసాయ అధికారి కార్యాలయంలో రైతులకు వరి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాటట్లాడుతూ రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సకాలంలో విత్తనాలు, ఎరువులు పంపిణీ చేయాలన్నారు. రైతులు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీని వినియోగించుకోవాలని సూచించారు. గుమ్మగెడ్డ, పొగడవెల్లి గెడ్డలను ఆధునీకరణ చేసి మరికొంత ఆయకట్టు పెంచుతామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జేడిఏ కోటగిరి శ్రీధర్, ఏడీఏ లింగాల వెంకటమధు, ఏవో బొడ్డేపల్లి రవికుమార్, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నాటుసారా స్థావరాలపై సెబ్ దాడులు

**మందస, జూన్ 15 (వార్త):** మందస మండలంలోని నాటుసారా తయారీ కేంద్రాలపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు దాడులు చేశారు. కొండలోగాం పంచాయతీ రామరాయి, పట్టులోగాం, ఇంద్రాడివీధి, టబాగాం తదితర గ్రామాల్లో నిర్వహించిన దాడుల్లో 1600 లీటర్ల బెల్లం ఊటలను ధ్వంసం చేశారు. ఎస్ఈబీ సోంపేట సీఐ ఆర్.జైభీమ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రామచంద్రకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక




## భారత్, కెనడా మ్యాచ్ రద్దు

**వార్త స్పోర్ట్స్:** టీ20 ప్రపంచ కప్ 2024లో భాగంగా గ్రూప్ ఎలో భారత్, కెనడా మధ్య జరగాల్సిన మ్యాచ్ టాస్ పడకుండానే రద్దయింది. మ్యాచ్‌కు వర్షం ముప్పు ఉందని వాతావరణ శాఖ ముందుగానే తెలిపింది. అందుకు తగ్గట్టుగానే మ్యాచ్ జరిగే బ్రోవార్డ్ కౌంటీలో శనివారం భారీ వర్షం కురిసింది. దీంతో టాస్ వేయడం కూడా సాధ్యం కాలేదు. వర్షం ఆగిపోయినా మైదానం తడిగా ఉండటంతో అంపైర్లు రెండుసార్లు గ్రౌండ్‌ని పరిశీలించారు. అనంతరం మ్యాచ్ నిర్వహణ సాధ్యం కాదని అంపైర్లు తేల్చి రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇరుజట్లకు చెరో పాయింట్ కేటాయించారు. దీంతో గ్రూప్ దశను టీమ్‌ఇండియా ఏడు పాయింట్లు (3 విజయాలు, ఒక మ్యాచ్ రద్దు)తో ముగించింది. ఇప్పటికే సూపర్-8కు అర్హత సాధించిన భారత్.. జూన్ 20న తొలి మ్యాచ్‌లో అఫ్గానిస్థాన్‌తో తలపడనుంది. జూన్ 22న రెండో మ్యాచ్‌లో బంగ్లాదేశ్ లేదా నెదర్లాండ్స్‌తో తలపడనుంది. జూన్ 24న తన చివరి మ్యాచ్‌లో ఆస్ట్రేలియాను ఢీకొట్టనుంది. సూపర్-8లోని రెండు గ్రూపుల్లో టాప్-2లో నిలిచిన జట్లు సెమీస్‌కు చేరతాయి. జూన్ 26న తొలి సెమీస్, 27న రెండో సెమీస్ మ్యాచ్‌లు జరగనున్నాయి. జూన్ 29న బార్బడోస్‌లో ఫైనల్ జరగనుంది.

## 'డబుల్ ఇస్మార్ట్' రిలీజ్ డేట్ ఫిక్స్

ఉస్తాద్ రామ్ పోతినేని నటిస్తున్న క్రేజీ సీక్వెల్ మూవీ 'డబుల్ ఇస్మార్ట్' ఇప్పటికే షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ సినిమాను దర్శకుడు పూరీ జగన్నాథ్ డైరెక్ట్ చేస్తున్నారు. ఈ మూవీపై సాలిడ్ బజ్ క్రియేట్ అయ్యింది. ఇక ఈ చిత్ర పోస్టర్స్ మూవీపై అంచనాలను రెట్టింపు చేశాయి. కాగా, ఈ సినిమాను ఎప్పుడెప్పుడు రిలీజ్ చేస్తారా అని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అయితే, ఈ సినిమా రిలీజ్ డేట్ పై మేకర్స్ తాజాగా క్లారిటీ ఇచ్చారు. ఈ మూవీని ఆగస్టు 15న రిలీజ్ చేస్తున్నట్లు చిత్ర యూనిట్ తాజాగా ఓ సరికొత్త పోస్టర్ తో అనౌన్స్ చేశారు. ఇక ఈ సినిమాతో రామ్, పూరీల కాంబినేషన్ మరో బిగ్ హిట్ అందుకోవడం ఖాయమని అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. 'డబుల్ ఇస్మార్ట్' సినిమాలో బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ విలన్ పాత్రలో నటిస్తున్నాడు. ఈ మూవీలో యంగ్ బ్యూటీ కావ్య తాపర్ హీరోయిన్ గా నటిస్తోండగా.. షాయాజీ షిండే, గెటప్ శ్రీను తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాకు మణిశర్మ సంగీతం అందిస్తుండగా చార్మీ కౌర్ తో కలిసి పూరీ జగన్నాథ్ ఈ చిత్రాన్ని సంయుక్తంగా ప్రొడ్యూస్ చేస్తున్నారు.




## పాకిస్థాన్, న్యూజిలాండ్ ఔట్

ఆరంభం నుంచి సంచలనాలకు వేదికగా మారిన 2024 టీ20 ప్రపంచకప్‌లో 24 గంటల వ్యవధిలో రెండు పెద్ద జట్లకు పెద్ద షాక్ తగిలింది. పాకిస్థాన్, న్యూజిలాండ్ టోర్నీ నుంచి నిష్క్రమించాయి. వేరే మ్యాచ్‌ల ఫలితాలు ఈ జట్ల కథను ముగించాయి. పాపువా న్యూగినీపై అఫ్గానిస్థాన్ విజయంతో న్యూజిలాండ్‌కు దారులు మూసుకుపోగా.. అమెరికా, ఐర్లాండ్ మధ్య మ్యాచ్ వర్షం వల్ల రద్దవడంతో పాకిస్థాన్ కథ ముగిసింది. అఫ్గానిస్థాన్, వెస్టిండీస్‌ల చేతిలో కివీస్ ఓడిపోయిన సంగతి తెలిసిందే. వరుసగా ఉగాండా, న్యూజిలాండ్, పాపువా న్యూగినీలను ఓడించిన అఫ్గాన్ గ్రూప్-సిలో అగ్రస్థానంతో ముందంజ వేసింది. ఈ గ్రూప్‌లో వెస్టిండీస్ సైతం మూడు విజయాలతో ఇప్పటికే సూపర్-8లో స్థానం సంపాదించింది. అఫ్గాన్.. పాపువా న్యూగినీ చేతిలో ఓడితే కివీస్‌కు అవకాశముండేది. మరోవైపు గ్రూప్-ఎలో భారత్ మూడు విజయాలతో ఇప్పటికే ముందంజ వేయగా.. అమెరికా గ్రూప్ నుంచి రెండో బెర్తును దక్కించుకుంది. ఆ జట్టు కెనడా, పాకిస్థాన్‌లను ఓడించి భారత్ చేతిలో ఓడింది. శుక్రవారం ఆ జట్టు.. ఐర్లాండ్‌తో తన చివరి మ్యాచ్ ఆడాల్సింది. అయితే వర్షం వల్ల ఈ మ్యాచ్ రద్దయింది. దీంతో మొత్తంగా 5 పాయింట్లతో గ్రూప్‌లో రెండో స్థానంతో ఆతిథ్య జట్టు ముందంజ వేసింది. అమెరికా ఈ మ్యాచ్‌లో ఓడితే.. పాకిస్థాన్‌కు అవకాశముండేది. ఆ జట్టు యుఎస్, భారత్ చేతుల్లో ఓడి.. కెనడాపై నెగ్గింది. చివరి మ్యాచ్‌లో ఐర్లాండ్‌పై నెగ్గి నెట్ రన్‌రేట్‌లో అమెరికా కన్నా మెరుగ్గా ఉంటే పాక్ ముందంజ వేసేది.

### ఒక్క పరుగుతో నేపాల్ ఓటమి

సంచలనాలకు వేదికైన పొట్టి ప్రపంచకప్ టోర్నీలో మరో ఉత్కంఠభరిత మ్యాచ్ జరిగింది. నేపాల్ 'సూపర్-8' ఆశలను దక్షిణాఫ్రికా కేవలం ఒకే ఒక్క పరుగుతో కూల్చేసింది. చివరివరకు ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో ఒక్క పరుగు తేడాతో సఫారీ జట్టు విజయం సాధించింది. దీంతో ముక్కలైన హృదయంతో నేపాల్ టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా 20 ఓవర్లకు 7 వికెట్లు నష్టపోయి 115 పరుగులు సాధించింది. స్వల్ప లక్ష్యంతో ఛేదనకు దిగిన నేపాల్ (%చీవఝఖశ్రీ%) ఇన్నింగ్స్‌ను దూకుడుగానే ఆరంభించింది. 8వ ఓవర్‌లో సఫారీ బౌలర్ షంసీ ఒకే ఓవర్‌లో రెండు వికెట్లు పడగొట్టి ఆ జట్టును దెబ్బకొట్టాడు. ఆ తర్వాత నేపాల్ పటిష్టస్థితిలోనే ఉండి విజయానికి చేరువైనట్లే కన్పించింది. అప్పుడు మళ్లీ బంతి అందుకున్న షంసీ.. 18వ ఓవర్‌లో రెండు వికెట్లు పడగొట్టి మ్యాచ్‌ను మలుపుతిప్పాడు. చివరి ఓవర్‌లో 8 పరుగులు అవసరం కాగా మ్యాచ్ ఉత్కంఠగా మారింది. తీవ్ర ఒత్తిడిలోనూ దక్షిణాఫ్రికా బౌలర్ బార్ట్‌మన్ నేపాల్ బ్యాటర్లను కట్టడి చేశాడు. చివరి బంతికి రెండు పరుగులు అవసరం కాగా.. గుల్సాన్ ఝాను ఔట్ చేశాడు. దీంతో ఒక్క పరుగు తేడాతో దక్షిణాఫ్రికా విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో నేపాల్ గెలిస్తే సూపర్-8 రేసులో నిలబడేది. ఓటమి పాలవడంతో టోర్నీ నుంచి తిరుగుముఖం పట్టింది. సఫారీ బౌలర్ షంసీ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

## హరోం హర
# మాస్.. మూవీ




### నటీనటులు:

సుధీర్ బాబు, మాల్వికా శర్మ, సునీల్, జయప్రకాష్, లక్కి లక్ష్మణ్, అక్షర గౌడ, అర్జున్ గౌడ, రవి కాలే

దర్శకుడు: జ్ఞాన సాగర్ ద్వారక, నిర్మాతలు : సుమంత్ జి. నాయుడు, సంగీత దర్శకుడు: చైతన్ భరద్వాజ్

ఈ వారం థియేటర్స్ లోకి వచ్చిన పలు చిత్రాల్లో మన టాలీవుడ్ నుంచి వచ్చిన సాలిడ్ యాక్షన్ డ్రామా "హరోం హర" కూడా ఒకటి. నైట్రో స్టార్ నుంచి నవ దళపతి సుధీర్ బాబుగా మారి చేసిన ఈ చిత్రం ట్రైలర్ తోనే అందరిలో మంచి అంచనాలు రేకెత్తించింది. ఇక ఈ చిత్రం అంచనాలు అందుకుందో లేదో సమీక్ష లో చూద్దాం రండి.

### కథ:

ఈ సినిమా నేపథ్యం 1980 దశకం చిత్తూరు జిల్లా కుప్పంలో సెట్ చేయబడి ఉంటుంది. అలా కుప్పం ప్రాంతంలో అత్యంత క్రూరంగా ప్రజల్ని హింసిస్తూ, వారి భూములు లాక్కొని భయపెడుతూ తమ్మిరెడ్డి (లక్కి లక్ష్మణ్) తన తమ్ముడు, కొడుకు శరత్ రెడ్డి (అర్జున్ గౌడ) లతో తానే కింగ్‌లా జీవిస్తాడు. మరి ఈ క్రమంలో ఆ ప్రాంతానికి చిన్నపాటి ఉద్యోగం కోసం ఓ కాలేజ్ లో లాబ్ అసిస్టెంట్ గా సుబ్రహ్మణ్యం(సుధీర్ బాబు) వస్తాడు. తన తండ్రి (జయ ప్రకాష్) చేసిన అప్పులు తీర్చడానికి తన టాలెంట్ తో తుపాకుల మాఫియాలోకి సుబ్రహ్మణ్యం అడుగుపెడతాడు. ఈ క్రమంలో తనకు ఎంతో ఇష్టమైన తండ్రికి తమ్మిరెడ్డి వల్ల ఆపద ఎలా వస్తుంది? తన ప్రజల కోసం సుబ్రహ్మణ్యం ఏం చేస్తాడు? గన్ మాఫియా వల్ల సుబ్రహ్మణ్యంకి మంచి జరుగుతుందా చెడు జరుగుతుందా అనేవి తెలియాలి అంటే ఈ సినిమా చూడాల్సిందే.

### ప్లస్ పాయింట్స్:

ఖచ్చితంగా ఒక నటుడుగా సుధీర్ బాబుని ప్రతి సినిమాకు మెచ్చుకొని తీరాలి. తన కథా ఎంపిక నుంచి తన పాత్రలకి తాను ఇస్తున్న పెర్ఫామెన్స్ లు చాలా బాగున్నాయని చెప్పాలి. అలా ఈ సినిమాలో తన నుంచి 100 శాతానికి మించి సుధీర్ బాబు అందించాడు. తన లుక్స్ అయితేనేం, మాట, నడవడిక అన్నిట్లో కూడా తాను అదరగొట్టేసాడు. అలాగే తనపై పలు ఎమోషన్స్ కానీ యాక్షన్ సీక్వెన్స్ లు కానీ చాలా బాగున్నాయి. ఇక ఈ సినిమాలో సుధీర్ తో ఆద్యంతం కనిపించిన నటుడు సునీల్ ఫలని స్వామిగా మంచి నటన కనబరిచారు. ఇంకా మాళవిక పాత్ర కూడా బాగుంది. ఇంకా విలన్ పాత్రల్లో కనిపించిన నటుడు కేజీయఫ్ ఫేమ్ లక్కి లక్ష్మణ్ సాలిడ్ విలనిజాన్ని చూపించారు అని చెప్పాలి. అలాగే కన్నడ నటుడు అర్జున్ గౌడ మంచి డెబ్యూ ఈ సినిమా తో టాలీవుడ్ లో అందించాడు. ఇక ఈ సినిమాలో హైలైట్ అంశాల్లో హీరో ఎలివేషన్స్ కానీ, మెయిన్ గా సినిమా టోన్ యూనిక్ గా సాగుతున్నట్టుగా ఫస్టాఫ్ లో అనిపిస్తుంది అలాగే బ్యాక్గ్రౌండ్ స్కోర్ చాలా సీన్స్ ని మంచి రిఫ్రెషింగ్ గా చూసేందుకు ఇంపుగా మార్చాయి. అలాగే మాస్ అండ్ మంచి వైలెన్స్ యాక్షన్ ని ఇష్టపడేవాళ్ళకి కూడా పుష్కలంగా సాలిడ్ ఎలిమెంట్స్ ఉన్నాయి. ఇక వీటితో పాటుగా సుధీర్, జయప్రకాష్ నడుమ ఎమోషన్స్ బాగున్నాయి. ఇతర నటీనటులు కాదంబరి కిరణ్, అక్షర గౌడ తదితరులు తమ పాత్రలకి పూర్తి న్యాయం చేకూర్చారు.

### మైనస్ పాయింట్స్:

ఈ సినిమాలో మేజర్ డ్రా బ్యాక్ ఏదన్నా ఉంది అంటే అది సినిమా లైన్ అని చెప్పాలి. ఇటీవల కాలంలో హీరోని బాగా ఎలివేట్ చేసేందుకు వస్తున్న తరహా లైన్ లోనే హరోం హర కూడా కనిపిస్తుంది. యశ్ కి కేజీయఫ్, అల్లు అర్జున్ కి పుష్ప ఎలానో ఇది సుధీర్ బాబు వెర్షన్ అని చెప్పాలి. అయితే సినిమాలో ఎంచుకున్న ప్రాంత నేపథ్యం భాషా యాస కూడా అలానే ఉండడంతో పుష్ప షేడ్స్ మరింత ఎక్కువగా ఉన్నట్టు అనిపిస్తుంది. కథని చెప్తూ తీసుకెళ్లే విధానం యాస కూడా ఆ సినిమానే మరిపిస్తుంది. ఇక వీటితో పాటుగా సెకండాఫ్ కొంచెం అక్కడక్కడ స్లో అయినట్లు అనిపిస్తుంది. అలాగే అన్ని యాక్షన్ సీక్వెన్స్ లతో పోలిస్తే క్లైమాక్స్ యాక్షన్ ఎపిసోడ్ మాత్రం చాలా అసహజం గా అనిపిస్తుంది. ఇది ఇంకాస్త బెటర్ గా చేయాల్సింది. అలాగే కొన్ని సీన్స్ లో లాజిక్స్ లేవు మరికొన్ని సీన్స్ అయితే ఇది వరకే చాలా సినిమాల్లో చూసినట్టే అనిపిస్తాయి. మెయిన్ గా ఒక్క హీరో పాత్రని మాత్రమే ఎలివేట్ చేస్తూ సాగే సినిమాలు చాలా గుర్తు రావచ్చు. ఇక వీటితో పాటుగా మాళవిక పాత్రకి సినిమాలో మరీ అంత స్కోప్ లేదు.

### సాంకేతిక వర్గం:

సినిమా నిర్మాణ విలువలు చాలా బాగున్నాయి. సినిమా సెటప్ కి తగ్గట్టుగా వింటేజ్ బ్యాక్ డ్రాప్ అంతా నీట్ గా ఉంది. ఇక సాంకేతిక వర్గంలో మొదటగా చైతన్ భరద్వాజ్ చాలా మంచి సంగీతం అందించారు. మెయిన్ గా ఆ బ్యాక్గ్రౌండ్ స్కోర్ అయితే సినిమాని ఓ రేంజ్ లో ఎలివేట్ చేసింది. ఇంకా అరవింద్ విశ్వనాథ్ సినిమాటోగ్రఫీ కూడా చాలా బాగుంది. రవితేజ గిరిజాల ఎడిటింగ్ బానే ఉంది కాని కొన్ని సీన్స్ ని వేగవంతం చేయాల్సింది. ఇక దర్శకుడు జ్ఞానసాగర్ ద్వారక విషయానికి వస్తే.. తను దర్శకునిగా ఈ సినిమాతో మెప్పించాడు కానీ చాలా రొటీన్ కథని తీసుకున్నాడు. డైలాగ్స్ ని బాగా రాసుకున్నాడు అలాగే స్క్రీన్ ప్లే ని కూడా చక్కగా ప్లాన్ చేసుకున్నాడు కానీ ఒక్క కథ విషయంలో పాన్ ఇండియా హిట్స్ పుష్ప, కేజీయఫ్ లని చూసినవాళ్ళకి కొత్తగా అనిపించకపోవచ్చు. కానీ తన వెర్షన్ వరకు హరోం హర ని కూడా ఎక్కడా తగ్గించే విధంగా తెరకెక్కించలేదు. పర్ఫెక్ట్ గా ఎక్కడెక్కడ ఎంత కావాలో ఏ నటీనటులు నుంచి ఎంత రాబట్టాలో బాగానే చూసుకున్నాడు. ఒక్క సినిమా లైన్ విషయం తప్ప తన సైడ్ నుంచి లోపాలు అంత ఎక్కువ లేవు.

### తీర్పు:

ఇక మొత్తంగా చూసినట్టు అయితే ఈ "హరోం హర" సుధీర్ బాబు నుంచి మరో సాలిడ్ అటెంప్ట్ అని చెప్పాలి. నటుడుగా కూడా ఈ సినిమా తనకి ప్లస్ గా మారింది అని చెప్పవచ్చు. మంచి క్లీన్ ఎలివేషన్స్, సాలిడ్ మ్యూజిక్ టేస్ట్ ఉన్నవాళ్ళని ఈ సినిమా ఎంగేజ్ చేస్తుంది. దర్శకుడు కూడా సినిమాని బాగానే మలిచాడు కానీ లైన్ ఒకింత రొటీన్ గా అనిపిస్తుంది. ఆల్రెడీ తెలిసిన లైన్ అయినా పర్వాలేదు అంటే ఈ సినిమా మాస్ ఆడియెన్స్‌ని బాగానే మెప్పిస్తుంది.

Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, APTEL:016413